క్లుప్తంగా

14న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్సార్ సర్కిల్: ఈనెల 14న అర్హులైన పేదలకు సాగు భూములను అందించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. బడాబాబులు ప్రభుత్వ భూములకు తప్పుడు రికార్డులను సృష్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

27న ముస్లిం ఐక్యవేదిక సమావేశం

కడప రూరల్ : ఈ నెల 27న గుంటూరులో నిర్వహించే ముస్లిం ఐక్య వేదిక సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ వేదిక నేతలు అబ్దుల్ కలాం, సయ్యద్ సలావుద్దీన్, అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలు సమావేశాలు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో సయ్యద్ ఖలీల్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై మాట తప్పిన బీజేపీ

కడప సెవెన్‌రోడ్స్ : తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు గడిచినా ఇంతవరకు అమలు చేయకుండా మాట తప్పిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ధ్వజమెత్తారు. గురువారం కడప నగరంలోని టీచర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన ఆ సంఘ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు బిల్లు ప్రవేశపెట్టకపోగా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని దేశ వ్యాప్త సమస్యగా చిత్రీకరిస్తోందని దుయ్యబట్టారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యల్లయ్య, స్వామినాథన్, తప్పెట హరిబాబు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సేవలు సకాలంలో అందించాలి



వినియోగదారుల సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: విద్యుత్ సేవలను సకాలంలో అందించాలని, అలా అందించని వారిపై కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ హెచ్చరించారు. గురువారం కడపలోని వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ సమస్యలతో వచ్చినప్పుడు వారితో మమేకమై సభ్యతతో వ్యవహరించి పరిష్కరించాలన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందజేయాలన్నారు. ప్రజలు కొత్త సర్వీసుల విడుదల, ఇతర సేవలకు నమోదు చేసుకున్న తర్వాత సంస్థ నిర్ధారించిన కాల వ్యవధిలో పనులు చేసేలా చూడాలన్నారు. కొందరు వినియోగదారులకు ఆయన స్వయంగా ఫోన్ చేసి సంస్థ ద్వారా అందిస్తున్న సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో వినియోగదారుల సేవా కేంద్రం డీఈ సుబ్రమణ్యం, ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

కడప అర్బన్: కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్లంమండి వీధిలో నివాసం వుంటున్న ప్రియ, తన భర్త హరిప్రసాద్ తనను వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ సంజీవరాయుడు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. గురువారం ×గడప గడపకు మన ప్రభుత్వం☆ కార్యక్రమంలో భాగంగా 45వ డివిజన్‌లోని ఊటుకూరు, చెమ్ముమియ్యాపేట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలిగిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా ..అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సి. నాగలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక, విద్యా దీవెన, జగనన్న ఇంటి స్థలం ద్వారా రూ.10.50లక్షల మేలు చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. ఎన్. రుక్మిణి అనే మహిళ మాట్లాడుతూ తమకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆసరా, కాపునేస్తం, పింఛన్ కానుక, సున్నావడ్డీ, జగనన్న ఇంటి స్థలం వల్ల రూ.9.45లక్షల లబ్ధి చేకూరిందని, గతంలో ఏ ప్రభుత్వంలోనే ఇంత మేలు జరగలేదని తెలిపారు. బాబాబీ అనే మహిళ మాట్లాడుతూ జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, జగనన్న చేదోడు, జగనన్న ఇంటి స్థం ద్వారా రూ.9.35లక్షల మేలు జరిగిందని తెలిపారు. పేదలకు సాయం చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 45వ డివిజన్ ఇన్‌చార్జి జి. శ్రీనివాసురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, శ్రీరంజన్‌రెడ్డి, షఫీ, అరీఫుల్లా బాషా, సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, మున్నా పాల్గొన్నారు.

ఖాజీలు ఇచ్చే మ్యారేజ్ సర్టిఫికెట్లను గుర్తించాలి

ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వ ఖాజీలు ఇచ్చే మ్యారేజ్ సర్టిఫికెట్లను చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఖాజీ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌కే ఎండీ ఇసాక్ జియాయి కోరారు. గురువారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఇటీవలి కాలంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో, రిజిస్ట్రార్ ఆఫీసుల్లో మ్యారేజ్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారన్నారు. ఖాజీలను కూడా ప్రభుత్వమే నియమిస్తుంది కాబట్టి వారు ఇచ్చే మ్యారేజ్ సర్టిఫికెట్లను గుర్తించి, చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఖాజీల నియామకానికి కాలపరిమితి ఉండేది కాదని, ప్రస్తుతం మూడేళ్ల కాలపరిమితి విధించడం ఖాజీ యాక్ట్‌కు విరుద్ధమన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలన్నారు.

నగరంలో భారీ వర్షం

కడప కార్పొరేషన్: కడప నగరంలో గురువారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి దట్టమైన మేఘాలు కమ్ముకొని సన్నటి జల్లులతో ప్రారంభమైన వాన ఆ తర్వాత భారీగా కురిసింది. వర్షం వల్ల నగరంలోని ఆర్టీసీ బస్టాండు, గురుకుల్ విద్యాపీఠ్, అప్సర, వినాయకనగర్ సర్కిల్, ఫక్కీరుపల్లె, జిల్లా కోర్టు తదితర ప్రాంతాల్లో రహదారులపై పెద్ద ఎత్తున నీరు నిలిచింది. ఉదయం వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చిన వారు, పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫుట్ పాత్ వ్యాపారులు 11 గంటల వరకూ దుకాణాలు తెరవలేకపోయారు. తోపుడు బండ్ల వ్యాపారులు అవస్థలు పడ్డారు. వాన వల్ల నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో భారీ స్థాయిలో నీరు నిలిచింది.

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో గురువారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షంతో ఆర్టీసీ బస్టాండుతోపాటు పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండు ఆవరణంతోపాటు గ్యారేజీలో కూడా వర్షపు నీరు నిలబడడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బస్టాండుకు వచ్చిన వారితోపాటు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు బస్టాండుకు చేరుకున్న వారు వర్షపు నీటిలోనే నడవాల్సి వచ్చింది. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు బస్సు ఎక్కేందుకు ఇబ్బంది పడ్డారు.



నగరంలో వర్షం కురుస్తున్న దృశ్యం



ఆర్టీసీ బస్టాండు వద్ద

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

– వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ : స్వాతంత్ర్య సముపార్జనలో అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ ముందుకుసాగాలని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా 'మేరీ మట్టి.. మేరా దేశ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి వేమన విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నేలతల్లికి వందనం.. అమరవీరులకు అభివందనం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశసమైక్యతకు మనమంతా పాటుపడదామని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకటరామిరెడ్డి విద్యార్థులతో 'పంచ్ ప్రాణ్' ప్రతిజ్ఞను చేయించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్–9 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు, డా. టి. చంద్రశేఖర్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



వేమన విగ్రహం వద్ద మేరీ మట్టి.. మేరా దేశ్ కార్యక్రమంలో విద్యార్థులు

12న ఫ్యాప్టో నిరసన

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు విద్యారంగ పరిరక్షణ కోసం ఈ నెల 12వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయ్‌కుమార్ కోరారు. గురువారం కడప యూటీఎఫ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయులను పనిగట్టుకొని వేధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ట్రెజరర్ వెంకటసుబ్బయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో రహదారుల విస్తరణ జరుగుతున్న అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్, గోకుల్ లాడ్జి– క్రిష్ణా సర్కిల్, దేవునికడప రోడ్లలో డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన ఆ ప్రాంతాల్లో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించారు. ఆర్టీసీ కూడలి వద్ద వర్షపునీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోకుల్ లాడ్జి రోడ్డులో, క్రిష్ణా సర్కిల్ నుంచి పాలెం పాపయ్య వీధిలో డ్రైనేజీ పనులను ప్రారంభించాలన్నారు. మాచుపల్లి బస్టాండు వద్ద జంక్షన్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. దేవుని కడప చెరువు వద్ద జంక్షన్, డ్రైనేజీ పనులను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నచౌక్ సీఐగా నరసింహారెడ్డి

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా పి. నరసింహారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లాకు చెందిన నరసింహారెడ్డి 2004 బ్యాచ్ ఎస్ఐగా జిల్లాలో ఎర్రగుంట్లలో మొదట విధుల్లో చేరారు. తరువాత చింతకొమ్మదిన్నె, మైదుకూరు, ముద్దనూరులలో ఎస్ఐగా పనిచేశారు. 2018లో సీఐగా పదోన్నతి పొందారు. ప్రొద్దుటూరు టూటౌన్, చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో సీఐగా పనిచేశారు. తరువాత కడప చిన్నచౌక్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం చిన్నచౌక్ సీఐగా పనిచేసిన శ్రీరామ్ శ్రీనివాసులు రెడ్ శాండర్స్ టాస్క్‌ఫోర్స్ (ఆర్ఎస్‌టిఎఫ్) సీఐగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో విధుల్లో చేరారు. జిల్లాలో బద్వేల్ సీఐగా పనిచేసిన హనుమంతనాయక్ ఆళ్లగడ్డకు బదిలీ అయి విధుల్లో చేరారు.

అర్హులందరూ లబ్ధి పొందేలా చూడాలి

కడప రూరల్: నవరత్నాల పథకాలకు ఈకేవైసీ చేయించి అర్హులు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మయ్య తెలిపారు. గురువారం తన కార్యాలయంలోని ఛాంబర్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల కార్పొరేషన్ ఈడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలులో భాగంగా జగనన్న చేదోడు, వైఎస్సార్ కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, అమ్మ ఒడి తదితర పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ పథకాలకు సంబంధించి ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులను గుర్తించాలన్నారు. వారిచేత తక్షణం ఈకేవైసీ చేయించాలని తెలిపారు.

తెలుగుతల్లి గీతంతో 'సుందరాచారి'కి చిరకీర్తి

కడప కల్చరల్ : తెలుగువారికి ప్రాణప్రదంగా మారిన మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీత రచనతో శంకరంబాడి సుందరాచారికి చిరకీర్తి లభించిందని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురువారం శంకరంబాడి 110వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం శంకరంబాడి సుందరాచారిని ప్రసన్న కవి బిరుదుతో సత్కరించిందన్నారు. ఆయన జీవితం, సాహిత్యాలను పరిచయం చేస్తూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఆయన పేరిట గ్రంథాన్నిరాశారని గుర్తు చేశారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ గాంధీజీ కన్నుమూసిన సందర్భంలో బలిదానం పేరిట కావ్యం రాశారని, జానపద శైలిలో అనేక గీతాలు రాశారన్నారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి , బ్రౌన్ కేంద్రం లైబ్రరీ అసిస్టెంట్ ఎన్.రమేష్‌రావు మాట్లాడారు.



శంకరంబాడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మణిపూర్‌లో మారణహోమం అమానుషం

కడప రూరల్: 'మణిపూర్‌లో జరుగుతున్న అమానుష సంఘటనలు యావత్ ప్రపంచం సిగ్గుపడేలా చేశాయి. అక్కడి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా అమాయకులపై దాడులు జరుగుతున్నాయి. మైన్స్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి అల్లర్లు చెలరేగుతున్నాయి' అని వక్తలు ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్ ఆధ్వర్యంలో సీఆర్‌వీ ప్రసాద్ అధ్యక్షతన అఖిలపక్ష నేతలతో గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ, బండి జకరయ్య మాట్లాడుతూ దేశ చరిత్రలోనే మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలు మాయని మచ్చగా నిలిచిపోతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగానే అక్కడ అమానుష సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. అపారంగా ఉన్న మైన్స్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. దాని ఫలితంగానే అక్కడ అల్లర్లతో అట్టుడికిపోతోందన్నారు. సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న బడుగు బలహీన వర్గాలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జేవీ రమణ, అవ్వారు మల్లికార్జున, గుర్రప్ప, దస్తగిరిరెడ్డి , అఖిలపక్ష నేతలు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నేతలు

మణిపూర్ బాధితులను ఆదుకుందాం

కడప కల్చరల్ : మణిపూర్ బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు సుబాన్‌బాష కోరారు. మణిపూర్ బాధితుల కోసం కడప నగరంలోని సీఎస్ఐ హైస్కూలు 1979 బ్యాచ్ విద్యార్థులు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుబాన్‌బాష ఆధ్వర్యంలో బ్యానర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మణిపూర్ బాధితులకు ప్రజలు ధనం రూపంలో సహాయం చేయవద్దని, దుప్పట్లు, దోమతెరలు, టవళ్లు, పుస్తకాలు, దుస్తులు, ప్లాస్టిక్ రూఫింగ్ షీట్స్ విరాళంగా ఇవ్వాలని కోరారు.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవీధికి చెందిన తిరుమల శెట్టి వెంకటరమణ తన భార్య శివమల్లేశ్వరి, ముగ్గురు పిల్లలు శ్రీనిధి (7), యశ్వంత్ (5), ప్రణవి (3)లతో కలిసి ఈనెల 4వ తేదీన దుస్తులు తీసుకుని వెళ్లిపోయిందని గురువారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. తన భార్య శివమల్లేశ్వరి రిలయన్స్ జియో సంస్థలో కాల్‌వర్కర్‌గా పనిచేస్తోందని, ప్రతిరోజూ ఉదయం 9గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాత్రి వస్తుంది. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు పెరుగుతున్నాయన్నా రు. ఈనెల 4 న శివమల్లేశ్వరి తన పుట్టింటికి వెళ్లింది. తిరిగి వచ్చి దుస్తులను తీసుకుని ఎవరూలేని సమయంలో పిల్లలతో సహా వెళ్లిపోయిందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు కడప టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు చేతులతోపాటు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తే నులిపురుగులు దరిచేరవని కడప నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం కడప మున్సిపల్ హైస్కూల్ గాంధీనగర్‌లో విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలను మింగించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ పిల్లలు పరిశుభ్రత కలిగి క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికేఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, కడప డివిజన్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ లక్ష్మీకర్, డిప్యూటీ డెమో రమణమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యసుజాతమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్